అపార్ పేరిట వ్యాపారం

- ఆధార్ అప్‌డేట్ చేసేందుకు అక్రమంగా వసూలు
- కార్డులో చిన్న తప్పుదొర్లినా సరిదిద్దేందుకు రూ.వేలు డిమాండ్
- అడిగినంత ఇస్తేనే మార్పు చేర్పులు
- డబ్బులిచ్చుకోలేక కార్డుదారుల అవస్థలు
- స్కూల్ రికార్డులకు అనుగుణంగా ఆధార్ ఉండాలంటున్న పాఠశాల సిబ్బంది
- ఆధార్ కేంద్రాలకు పరుగులు తీస్తున్న విద్యార్థులు


రాయదుర్గంలో ఆధార్ అప్‌డేట్ కోసం వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

రాయదుర్గం/కళ్యాణదుర్గం: రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని ప్రభుత్వ పాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 777 ఉన్నాయి. ఇందులో 1,18,530 మంది విద్యార్థులు చదువుతున్నారు. సుమారు 300లు ప్రైవేటు పాఠశాలలు, 25 ఇంటర్ కళాశాలలు ఉన్నాయి. ఇందులోనూ సుమారు లక్ష మందికి పైగా బడులకు వెళుతున్నారు. అవగాహన లోపం కారణంగా చాలామంది విద్యార్థులు ఆధార్ కార్డుల్లో పేర్లు తప్పులు దొర్లాయి. మూడు నియోజకవర్గాల్లోని 48 ఆధార్ కేంద్రాలు తెరిచారు. అప్‌డేట్ కోసం విద్యార్థులు క్యూకడుతున్నారు. ఇదే అదునుగా భావిస్తూ కొందరు కేంద్రాల నిర్వాహకులు కొర్రీలు పెట్టి జేబులు గుల్ల చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఆధార్ కేంద్రాల వద్ద కార్డుదారులను పలకరిస్తే రూ.1500, రూ.2వేలు డిమాండ్ చేస్తున్నారని బహిరంగంగా ఆరోపణలు చేయడం విశేషం. పేద విద్యార్థుల అవసరాన్ని ఆసరాగా చేసుకొని 'అపార్'మైన వసూళ్లకు పాల్పడుతున్న ఆధార్ కేంద్రాల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి.

» రాయదుర్గం పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో మల్లెపూల కృష్ణ (పేరుమార్చాం) పదో తరగతి చదువుతున్నాడు. పాఠశాల రికార్డుల్లో ఎం. జైకృష్ణగా నమోదైంది. ఆన్‌లైన్‌లో 'అపార్' నమోదుకు అభ్యంతరం వచ్చింది. దీంతో ఆధార్‌లో పేరుమార్చుకొని రావాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తెలియజేశారు. ఆ విద్యార్థి..తండ్రితో కలసి ఆధార్ కేంద్రానికి వెళ్లాడు. ఇక్కడ సాధ్యం కాదు..హైదరాబాద్‌లోని మెయిన్ బ్రాంచ్‌కు వెళ్లాలని చెప్పి పంపారు. ఆధార్ కేంద్రం నిర్వాహకులు చెప్పేది అర్థం కాక తండ్రీకొడుకులకు వెనుదిరిగారు.

» గుమ్మఘట్ట మండలంలోని ఓ గ్రామానికి చెందిన రమ్య (పేరు మార్చాం) స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఆధార్‌కార్డులో పుట్టిన తేదీ 2010 ఏప్రిల్ 14గా నమోదైంది. పాఠశాల రికార్డుల్లో 14-04-2011గా నమోదు చేశారు. 2010గా మార్చుకొని రావాలని విద్యార్థినికి పాఠశాలలో తెలియజేశారు. ఈ చిన్న తప్పిదాన్ని సవరించుకునేందుకు ఆధార్ కేంద్రానికి వెళ్లారు. అయితే అక్కడ రూ.1,500 వేలు ఇస్తే చేస్తామని ఖరాఖండిగా చెప్పారు. చేసేదిలేక విద్యార్థిని, ఆమె తండ్రి ఇంటికెళ్లిపోవాల్సి వచ్చింది. ఇలా ఈ ఇద్దరు, ముగ్గురే కాదు..చాలా మంది ఆధార్ కార్డులో తప్పులు దొర్లడంతో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వమే ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసి, ఎక్కడికక్కడ సర్టిఫికెట్లు ఇచ్చేవారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఆధార్ నిర్వాహకుల అక్రమ వసూళ్లపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆధార్ కేంద్రాలు, విద్యార్థుల వివరాలు ఇలా..

నియోజకవర్గం	ఆధార్ కేంద్రాలు	పాఠశాలలు	విద్యార్థులు
రాయదుర్గం	16	285	48,195
కళ్యాణదుర్గం	18	269	35,535
ఉరవకొండ	14	223	34,800
మొత్తం	48	777	1,18,530

హైదరాబాద్‌కు పొమ్మంటారు



నా కుమారుడు ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. కార్డులో ఒకలా, పాఠశాల రికార్డుల్లో మరోలా పేరు నమోదైంది. దీంతో ఆధార్ అప్‌డేట్ చేసుకురావాలని చెప్పారు. ఆధార్ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు.హైదరాబాద్ సెంట్రల్ ఆఫీస్‌కు వెళ్తే పరిష్కారం లభిస్తుందంటారు. ఈ సమస్యకు స్థానికంగా పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టాలి.

– గంగాధర, రాయదుర్గం

కఠిన చర్యలు తీసుకుంటాం

ఆధార్ కేంద్రాల్లో అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ నిబంధనల మేరకు నామినల్ ఫీజు తీసుకోవాలి. అధికంగా చెల్లించాల్సిన అవసరం లేదు. సచివాలయాల్లో కాకుండా ప్రైవేట్‌గా ఏర్పాటు చేసిన కొన్నిచోట్ల ఇలాంటి విమర్శలు తలెత్తాయి. సంబంధిత ఏజెన్సీలకు హెచ్చరికలు జారీ చేస్తాం. ప్రతి కేంద్రం వద్ద ప్రజలకు అర్థమయ్యేలా ధరల పట్టిక ఏర్పాటు చేయిస్తాం. అప్‌డేట్ చేసిన ప్రతి కార్డుదారుడికి ఫోన్‌చేసి విచారణ చేయిస్తాం. హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేదు. అలా ఎందుకు చెప్పారో విచారిస్తాం.

– నాగేశ్వరరావ్, డీఎల్‌డీఓ, కళ్యాణదుర్గం

జనన ధ్రువీకరణ పత్రం నుంచి మినహాయింపు ఇవ్వాలి



విద్యార్థులకు ఆధార్ అప్‌డేట్‌కు జనన ధ్రువీకరణ పత్రం నుంచి మినహాయింపు ఇవ్వాలి. పాఠశాల రికార్డుల్లో ఉన్న ప్రకారం ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఇచ్చే బోనాఫైడ్‌ను ప్రామాణికంగా తీసుకుని ఆధార్ అప్‌డేట్ చేయాలి. ఇందుకు జిల్లా అధికారులు ఆయా మండలాల విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలి.

– షేక్షావలి, వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి

విద్యార్థులకు 'అపార్'మైన కష్టం



ఇదిగో ఇక్కడ ఆధార్ కేంద్రానికి వచ్చిన విద్యార్థి పేరు హెచ్.సూర్య ప్రకాష్. విద్యార్థిది కళ్యాణదుర్గం మండలం మల్లిపల్లి. ఈస్ట్ కోడిపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. పాఠశాల రికార్డుల ప్రకారం హరిజన సూర్యప్రకాష్‌గా నమోదు చేశారు. ఆధార్‌లో మాత్రం హెచ్.సూర్యప్రకాష్‌గా నమోదు చేశారు. దీంతో పాఠశాల హెచ్‌ఎం స్కూల్ రికార్డుల ప్రకారం ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని సూచించడంతో కళ్యాణదుర్గంలోని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ సెంటర్‌కు వచ్చాడు. అప్‌డేట్ చేయాలంటే జనన ధ్రువీకరణ పత్రం ఉండాలని చెప్పడంతో దిక్కుతోచని స్థితిలో వెనుదిరిగాడు.



ఇతని పేరు వన్నూరప్ప. ఇతనిది బెళుగుప్ప మండలం ఎన్.గుండ్లపల్లి. ఈయన కుమార్తె హెచ్. గుణశ్రీ కురుగుంటలోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్‌లో ఆరో తరగతి చదువుతోంది. పాఠశాల రికార్డుల్లో మాత్రం వన్నూరుస్వామిగా నమోదు చేశారు. స్కూల్ రికార్డులకనుగుణంగా మార్చుకోవాలని సిబ్బంది తెలియజేశారు. వెంటనే కళ్యాణదుర్గంలోని ఆధార్ కేంద్రానికి వెళ్లిన వన్నూరప్ప.. తన పేరు సవరణ చేయాలని కోరాడు. నిబంధనల మేరకు గెజిటెడ్ నోటిఫికేషన్ (ఆధార్ అప్‌డేట్ కొరకు తహసీల్దార్ ధ్రువీకరించే దరఖాస్తు) ఉండాలని నిర్వాహకులు తెలియజేశారు. తిరిగి బెళుగుప్ప తహసీల్దార్‌కు చేరుకొని వ్యయ ప్రయాసలు పడాల్సి వచ్చింది.

అసలు అపార్ కార్డు అంటే ఏంటి?

ఈ కార్డుతో దేశంలో కేజీ నుంచి పీజీ వరకు చదివే విద్యార్థుల సమగ్ర వివరాలు ఒకే దగ్గర పొందుపరిచేలా కేంద్రం చర్యలు తీసుకుంటోంది. విద్యార్థి ఎల్‌కేజీలో చేరినప్పటి నుంచి విద్యాభ్యాసం పూర్తయ్యే వరకూ అన్ని వివరాలు ఇందులో ఉండనున్నాయి. పూర్తి వివరాలను ఎప్పటికప్పుడు గుర్తించేందుకు వీలుగా ఈ కార్డు ఉపయోగపడనుంది. కేంద్రం ఈ అపార్ కార్డును ఆధార్ కార్డు సంఖ్యతో పాటు 'అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్ (ఏబీసీ) అనే ఎడ్యులాకర్‌కు అనుసంధానం చేసేందుకు ప్రక్రియ ప్రారంభించింది. ఈ అపార్ నంబర్‌నే విద్యార్థి జీవిత కాల ఐడీగా పరిగణించనున్నారు. దీంతో విద్యార్థి అకడమిక్ జర్నీ, విద్యా ప్రయాణం, విజయాలు అన్నింటినీ పొందుపరచనున్నారు. అయితే ఆధార్ అక్షర దోషాలు, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లను సవరణ చేసేందుకు విద్యార్థులకు ఆన్‌లైన్ జనన ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి అంటూ ఆధార్ నిర్వాహకులు చెబుతున్నారు. విద్యార్థుల ఆధార్ సవరణల్లో విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పేర్లు సరిదిద్దుకునేందుకు అవస్థలు

కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానంలో కేంద్రం నూతన సంస్కరణలు అమలులోకి తెచ్చింది. ఆధార్ తరహా 'అపార్' (ఆటోమేటిక్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ప్రక్రియను ప్రారంభించింది. 'వన్ నేషన్- వన్ స్టూడెంట్' లక్ష్యంతో అన్ని రకాల విద్యా సంస్థల్లోనూ కేజీ నుంచి పీజీ వరకూ ప్రతి విద్యార్థికీ గుర్తింపు కార్డు జారీచేసే ప్రక్రియ మొదలైంది. 12 సంఖ్యలతో మంజూరు చేయనున్న అపార్ ఐడీ కార్డు కోసం విద్యార్థుల సమగ్ర వివరాలను ప్రధానోపాధ్యాయులు, కళాశాలల ప్రిన్సిపాళ్లు ఆన్‌లైన్‌లో నమోదుకు శ్రీకారం చుట్టారు. ఆధార్ ఎన్‌రోల్ సమయంలో పేర్లు నమోదు చేసే క్రమంలో కొన్ని తప్పులు (అచ్చుతప్పులు) దొర్లాయి. పాఠశాల రికార్డుల్లో ఒకలా, ఆధార్‌లో మరోలా ఉండడంతో ఆన్‌లైన్ నమోదుకు చిక్కులు ఎదురవుతున్నాయి. వాటిని గుర్తించిన ఉపాధ్యాయులు సరిదిద్దేందుకు ఆధార్ కేంద్రాలు పంపుతున్నారు.దీంతో రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు 'అపార్' కష్టాలను తెచ్చిపెట్టింది. అయితే ఇదే అదునుగా చేసుకున్న ఆధార్ కేంద్రాల నిర్వాహకులు.. విద్యార్థుల నుంచి కార్డుల్లో మార్పు చేర్పుల కోసం కూడా అక్రమంగా వసూలు చేస్తుండడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బందులకు గురవుతున్నారు.


ఆధార్ అప్‌డేట్ కోసం పడిగాపులు కాస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

క్లుప్తంగా

పంట పొలాలు సందర్శించాలి

- ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ మద్దిలేటి


మాట్లాడుతున్న ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ మద్దిలేటి

వజ్రకరూరు: వ్యవసాయ సిబ్బంది విధిగా రైతులు సాగుచేసిన పంట పొలాలను సందర్శించి, పంటలకు పట్టిన పురుగులు, తెగుళ్ల గమనించాలని ఆత్మప్రాజెక్టు డైరెక్టర్ మద్దిలేటి సూచించారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో రైతు సేవా కేంద్రాల సిబ్బందికి పంట తెగుళ్ల–వాటి యాజమాన్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో మండల వ్యవసాయఅధికారి మధుకర్, డీఆర్‌సీ ఏఈఓ ప్రసాద్, వీఏఏలు, వీహెచ్‌ఎలు, ఎంపీఈఓలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న సీఐ సయ్యద్ చిన్నగౌస్

బెళుగుప్ప: మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థినులకు సైబర్ నేరాలపై రూరల్ సీఐ సయ్యద్ చిన్నగౌస్ అవగాహన కల్పించారు. శుక్రవారం కేజీబీవీలో ఎస్ఐ శివ ఆధ్వర్యంలో కేజీబీవీ ఎస్ఓ నాగరత్న అధ్యక్షతన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకొని కార్యక్రమం ఏర్పాటు చేశారు.

రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు కొనకొండ్ల విద్యార్థులు


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్ల జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈనెల 21న గుంతకల్లులో జరిగిన జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీల్లో పాఠశాలకు చెందిన సాయి వర్ధన్, మనోజ్, సుభాన్, శ్రావణ్, శివా, సూర్యరాం, జస్వంత్, అపూర్వ, చైతన్య, ఇందు, లిఖిత , నందిని, సంజన పాల్గొని, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయినట్లు హెచ్‌ఎం వేణుగోపాల్,పీడీ సత్యనారాయణ,కళాధర్ తెలిపారు.

జిల్లా స్థాయి సైన్స్ ఫేర్‌లో విద్యార్థినుల ప్రతిభ


జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్‌లో విజేతలుగా నిలిచిన అంబేడ్కర్ గురుకులం విద్యార్థినులు

ఉరవకొండ: బుక్కరాయసముద్రంలోని కొర్రపాడులోని ఎస్సీ గురుకుల పాఠశాలలో ఈనెల 24న జరిగిన జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్‌లో అంబేడ్కర్ ఎస్సీ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో విజేతలుగా నిలిచినట్లు ప్రిన్సిపాల్ జ్ఞానప్రసూన తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ జయమ్మ, జేఎల్ సునీత, లైబ్రేరియన్ కుళ్లాయమ్మ మాట్లాడారు. సైన్స్‌ఫేర్ సీనియర్ విభాగంలో మాన్యశ్రీ, అమృతలక్ష్మి సేవ్ ఫార్మర్స్ ఎలక్ట్రికల్ షాక్ అనే అంశంపై ద్వితీయ బహుమతి సాధించినట్లు తెలిపారు. జూనియర్ విభాగంలో ఫారెస్ట్ అంశంపై మైథాలి శరణ్య, శ్రీరాగశ్రీ మొదటి బహుమతి, చంద్రయాన్-3 అంశంపై వైష్ణవి, జే.మానస మొదటి బహుమతి గెలుచుకున్నట్లు తెలిపారు.

216 మంది ఉద్యోగాలకు ఎంపిక


ఉద్యోగాలకు ఎంపికైన వారితో జాబ్‌మేళా నిర్వాహకులు

రాయదుర్గంటౌన్: బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిందనూరు నాగరాజు ఆధ్వర్యంలో కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన మెగా జాబ్‌మేళాలో 216 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. దాదాపు వెయ్యి మందికి పైగా నిరుద్యోగ యువతీయువకులు జాబ్‌మేళాకు హాజరయ్యారు. మొత్తం 40 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. జాబ్‌మేళాను రాయదుర్గం మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, తహసీల్దార్ నాగరాజు, ఎంఈఓ నాగమణి, అనంతపురం ఆర్ట్స్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ రంగస్వామి, కేటీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రఘురామమూర్తి, బీఎస్పీ రాష్ట్ర అధికార ప్రతినిధి వందన్‌కుమార్, సందర్శించి నిర్వాహకులను అభినందించారు. బీఎస్పీ రాయదుర్గం నియోజకవర్గ అధ్యక్షుడు జానకిరాముడు, రాయదుర్గం ఇన్‌చార్జ్ ఉలిగప్ప తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి


మాట్లాడుతున్న ఎంపీపీ ఎం.పవిత్ర

డి హీరేహాళ్ (రాయదుర్గం): ప్రజా సమస్యల పరిష్కారానికి అందరం కలసికట్టుగా కృషి చేద్దామని ఎంపీపీ ఎం. పవిత్ర అన్నారు. శుక్రవారం డి హీరేహాళ్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వైస్ ఎంపీపీ లింగన్న, ఎంపీడీఓ దాసా నాయక్, తహసీల్దార్ అనిల్‌కుమార్ హాజరయ్యారు. ముందుగా ఆయాశాఖల పురోగతిపై అధికారులు చర్చించారు. సభ దృష్టికి సభ్యులు పలు సమస్యలు తీసుకొచ్చారు. అనంతరం ఎంపీపీ మాట్లాడారు. ఎన్నికలు వరకే రాజకీయాలు చేసి, ఆతర్వాత గ్రామాల అభివృద్ధికి పాటుపడాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులందరిపైనా ఉందన్నారు. ప్రజా సంక్షేమం కోసం ఏ తీర్మానం చేయాలన్నా ముందుంటామని గుర్తు చేశారు. వర్షాలు కురుస్తున్న దృష్ట్యా సీజనల్ వ్యాధులు పురివిప్పుకున్నాయని, ప్రజా ఆరోగ్యంపై వైద్య శాఖ దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీరాజ్ ద్వారా చేపట్టే రోడ్లు, డ్రైనేజీలను అవసరాలను గుర్తించి నిర్మించేలా చూడాలన్నారు. పలు సమస్య పరిష్కారానికి కృషి చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీ, సర్పంచులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై దృష్టి పెట్టాలి


శెట్టూరు ఆరోగ్య కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మీదేవి

శెట్టూరు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీపీ లక్ష్మీదేవి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీపీతో పాటు డాక్టర్ తరుణసాయి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు. సమావేశంలో ఆస్పత్రిలోని ప్రధాన సమస్యలపై చర్చించారు. ఆస్పత్రిలో విద్యుత్ సమస్య ఉందని, ట్రాన్స్‌ఫార్మర్ సమస్యతో విద్యుత్‌కు అంతరాయం కలుగుతోందన్నారు. సమస్యలను ఎమ్మెల్యే, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సమావేశంలో నిర్ణయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురాంరావు, సూపర్‌వైజర్ లీలావతి, సీహెచ్‌ఓ శోభలత, యూడీసీ ఆదిలక్ష్మి, పీహెచ్‌ఎన్ సరోజమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

ఉరవకొండ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయలంలో శాశ్వత హుండీ కానుకలను ఆలయ అధికారులు శుక్రవారం లెక్కించారు. ఆలయ పర్యవేక్షణ అధికారి వన్నూర్‌స్వామి, ఆలయ ఈఓ సాకే రమేష్‌బాబు ఆధ్వర్యంలో గుంతకల్లుకు చెందిన హనుమాన్ సేవా సంస్థ సభ్యులు, ఆలయ సిబ్బంది లెక్కించారు. గత 4 నెలల 24 రోజులకు సంబంధించిన హుండీ మొత్తం రూ.29,70,873 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ తెలిపారు.

నట్టల నివారణ మందు పంపిణీ

బ్రహ్మసముద్రం : వర్షాకాలంలో జీవాలకు ఎక్కువగా వచ్చే నట్టలను నివారించేందుకు టీకా వేయించుకోవాలని మండల పశువైద్యాధికారి నవీన్ కుమార్ తెలిపారు. మండంలోని నాగిరెడ్డిపల్లి, బొమ్మగానిపల్లి గ్రామాల్లో జీవాలకు మందులు పంపిణీ చేశారు. సిబ్బంది లింగన్న, రమణ నాయక్ పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

బొమ్మనహాళ్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ దాసానాయక్ తెలిపారు. ఉదయం 10:30 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బొమ్మనహాళ్ : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉండొచ్చని బొమ్మనహాళ్, శ్రీధరఘట్ట పీహెచ్‌సీల వైద్యాధికారులు శ్రీలక్ష్మి, గీతాభార్గవి అన్నారు. శుక్రవారం మండలంలోని ఉద్దేహాళ్, సింగానహళ్లి గ్రామల్లో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఈ విజయభారతి, సూపర్‌వైజర్ ఉమాదేవి, హెల్త్ అసిస్టెంట్లు గోవర్ధన, శశికల, వెంకటరమణ, గౌతమి, ఈశ్వరమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

42 కర్ణాటక టెట్రా ప్యాకెట్లు పట్టివేత

వజ్రకరూరు: మండలంలోని గడేహోతూరు గ్రామంలో శుక్రవారం సాయంత్రం కర్ణాటకకు చెందిన 42 టెట్రా ప్యాకెట్లను పట్టుకున్నట్లు వజ్రకరూరు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన బెస్త మల్లన్న అనే వ్యక్తిని పట్టుకున్నట్లు తెలిపారు.

పశుగణనకు సహకరించండి


విడపనకల్లులో పశుగణనను పర్యవేక్షిస్తున్న పశుసంవర్ధక శాఖ డీడీ వెంకటేష్

ఉరవకొండ: పశుగణన సర్వేకు ప్రజలు సహకరించాలని ఉరవకొండ పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.వెంకటేష్ తెలిపారు. శుక్రవారం విడపనకల్లు మండల కేంద్రంలో పశుగణన కార్యక్రమాన్ని డీడీ ప్రారంభించారు. పలు గృహాలను సందర్శించి, పశువుల వివరాలు నమోదు చే శా రు. అనంతరం విడపనకల్లు పశువైద్యాధికారి డాక్టర్ నరేష్‌తో కలిసి డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వెంకటేష్ మాట్లాడారు.

కూడేరు: మండలంలోని అన్ని గ్రామాల్లో 21వ అఖిల భారత పశు గణనను తప్పులు లేకుండా చేపట్టాలని మండల పశు వైద్యాధికారి శ్రీనివాసులు సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆయన సిబ్బందికి పశు గణనకు సంబంధించిన మెటీరియల్‌ను ఆయన అందజేశారు. అనంతరం పశుగణన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లలితమ్మ, వీహెచ్‌ఏలు, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

వజ్రకరూరు: పశుగణనతో అనేక ఉపయోగాలు ఉన్నాయని పశువైద్యాధికారి కృష్ణమూర్తినాయక్ తెలిపారు. శుక్రవారం మండలంలోని రాగులపాడు,గూళ్యపాళ్యం,వెంకటాంపల్లి,గడేహోతూరు తదితర గ్రామాల్లో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశుగణనను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

28న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

రాయదుర్గంటౌన్: రాయదుర్గం పురపాలక సంఘం కౌన్సిల్ హాల్‌లో ఈ నెల 28న ఉదయం 10:30 గంటలకు సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశంలో పట్టణంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలతోపాటు ప్రజా సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు, విభాగాల వారీగా అధికారులు హాజరుకావాలని కోరారు.

భోజన పథకాన్ని పక్కాగా అమలు చేయాలి

వజ్రకరూరు: ప్రభుత్వ పాఠశాల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పక్కాగా అమలు చేయాలని ఎంఈఓ తిమ్మప్ప సూచించారు. శుక్రవారం మండలంలోని బోడిసానిపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను ఎంఈఓ తిమ్మప్ప ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో అమలౌవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మల్లేశ్వరి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కూలిన వంతెనను పరిశీలించిన అధికారులు

బ్రహ్మసముద్రం : మండలంలోని సూగేపల్లి గ్రామంలో ఇటీవలకురిసిన వర్షానికి, వర్షపు నీటి ప్రవాహానికి వంతెన కూలింది. దీంతో సూగేపల్లి– కోనాపురం గ్రామాల మధ్య రాక పోకలు నిలిచిపోయాయి. ఈ విషయాన్ని గ్రామస్తులు అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీడీఓ నందకిశోర్, పీఆర్ ఇంజనీర్ విజయ్ కృష్ణ శుక్రవారం గ్రామానికి చేరుకొని కూలి పోయిన వంతెనను పరిశీలించారు.

ఐఆర్, పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలి

కళ్యాణదుర్గం రూరల్: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలో భాగంగా ఉపాధ్యాయులకు వెంటనే ఐఆర్, పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పాతిరెడ్డి కోరారు. శుక్రవారం పట్టణంలోని నార్త్ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకటేశులు, మండల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు రామాంజనేయులు, రమేష్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలు పాటించాలి

కణేకల్లు: ప్రాణాంతక వ్యాధులొచ్చాక ఇబ్బందులు పడటం కంటే ముందస్తుగా జాగ్రత్తలు పాటించడమే అన్నింటికన్నా మేలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ తెలిపారు. శుక్రవారం మండలంలోని గరుడచేడు గ్రామంలో సీజనల్ వ్యాధులపై గరుడచేడు పీహెచ్‌సీ సిబ్బందితో కలిసి ఆయన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్బంగా ఆయన ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, హెల్త్ అసిస్టెంట్ సంపత్, వెంకటరెడ్డి, ఏఎన్‌ఎం స్వర్ణకుమారి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఆయుర్వేద దినోత్సవం

గుమ్మఘట్ట: స్థానిక పీహెచ్‌సీలో ఆయుర్వేద దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయుర్వేద వైద్యురాలు రాధాకుమారి మాట్లాడుతూ గతంలో ఆయుర్వేద వైద్యంతోనే రోగాలు నయమయ్యేవన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మురళీధర్, సూపర్‌వైజర్ ఆదిబయమ్మ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించండి


ఆస్పత్రి అభివృద్ధిపై చర్చిస్తున్న మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ, సీడీపీఓ లక్ష్మీప్రసన్న

కళ్యాణదుర్గం రూరల్: వివిధ ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని మున్సిపాల్ కమిషన్ వంశీ కృష్ణ, సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ ఆరోగ్యకేంద్రంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాజేష్ సమావేశం నిర్వహించారు. ఆస్పత్రి అభివృద్ధిపై చర్చించారు. అనంతరం పలు అభివృద్ధి పనులపై చర్చించారు.

ఎన్‌సీసీ క్యాడెట్లు సత్ప్రవర్తనతో మెలగాలి

కూడేరు: ఎన్‌సీసీ క్యాడెట్లు శిక్షణ అనంతరం క్రమశిక్షణ, సత్ప్రవర్తనతో మెలగాలని ఎన్‌సీసీ క్యాంప్ కమాండర్ కల్నల్ జోబీ ఫిలిప్స్ తెలి పారు. మండలంలోని బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఎన్‌సీసీ నగర్‌లో సీఏటీసీ 9 ఆంధ్ర బాలికల బెటాలియన్ ఎన్‌సీసీ శిక్షణా తరగతులు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఎన్‌సీసీ అధికారులు క్యాడెట్లకు ఆయుధాల వినియోగం, మ్యాప్ రీడింగ్‌పై శిక్షణ ఇచ్చారు. క్యాంప్ కమాండర్ మాట్లాడారు. క్యాంప్ కమాండర్ కల్నల్ జోబీ ఫిలిప్స్ మాట్లాడుతూ క్యాడెట్లు సమాజ సేవకు తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో కర్నూల్, అనంతపురం, నంద్యాల, పుట్టపర్తి జిల్లాలకు చెందిన 530 మంది క్యాడెట్లు, సుబేధర్ ఎంఆర్ బాషా, ఎన్‌సీసీ అధికారులు దయామణి, హేమ దుర్గా, గంగన్న, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యురాలికి ఆర్థిక సాయం

కళ్యాణదుర్గం రూరల్: వన్నూరబీ అనే మహిళ మెరుగైన చికిత్స కోసం ఇనిఫ్రనిటీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్థిక సాయం అందించారు. రోడ్డు ప్రమాదంలో వెన్నెముక, కాళ్లు విరిగి కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. బంధువుల ద్వారా తెలుసుకున్న ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దేనాయక్ రూ.20 వేలు వన్నూరబీ బంధువులకు అందజేశారు.